క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రుక్మిణి శ్రీకృష్ణుల కల్యాణం



శ్రీకృష్ణుడి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సత్తుపల్లిటౌన్‌: పట్టణంలోని జవహర్‌నగర్‌లో గల శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం శ్రీరుక్మిణి శ్రీకృష్ణుల కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో గుంజా వెంకటేశ్వరరావు, మిద్దే రామకృష్ణ, గట్టే వాసు, లక్ష్మయ్య, శైలజ, అశ్విని, రంగ, రమా, మల్లేశ్వరి, బేబి, పాపయ్య పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం



వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

వేంసూరు: మండల పరిధిలోని కందుకూరు వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు.

పినపాకలో శ్రీరామ నవమి పనులు ప్రారంభం



పినపాకలో పసుపు దంచుతున్న మహిళలు

తల్లాడ: మండలంలోని పినపాక గ్రామంలో సోమవారం సీతరామచంద్ర స్వామి పెండ్లి పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలో అత్యంత వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు జరుగుతాయి. గ్రామంలో 20 రోజుల ముందు నుంచే నవమి సంబరాలు ప్రారంభమౌతాయి. ఇందులో భాగంగా రాములోరికి పంచామృతాలతో చందనాది అభిషేకం, పసుపు కొట్టుట, వసంతోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, కవిత భక్తి బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభమైన అంకమ్మతల్లి జాతర



కమలాపురంలో వేంచేసి ఉన్న శ్రీఅంకమ్మ అమ్మవారు

ముదిగొండ: మండలపరిధిలోని కమలాపురంలో శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మి, శ్రీమద్దిరావమ్మ, పెద్దమ్మ అమ్మవార్ల జాతర సోమవారం నుంచి ప్రారంభమైంది. ఆలయంలో అమ్మవార్లకు కమలాపురం, అయ్యగారపల్లి భక్తులు పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పెద్దప్రభ ఊరేగింపుగా మేళ్లతాళ్లలతో పురవీధులలో బయలుదేరి ఆలయానికి చేరుకుంటుంది.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



దివ్యబలిపూజ సమర్పిస్తున్న పాస్టర్లు

వైరారూరల్‌: మండలంలోని గరికపాడు చర్చిలో క్రైస్తవులు జరుపుకునే పస్కా పండుగ వేడుకను పురస్కరించుకొని సోమవారం తెల్లవారుజామున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్‌ ఎం.యెహోషు బైబిల్‌ పాఠాలను బోధించారు. అనంతరం దివ్యబలి పూజ సమర్పించి ప్రతి ఒక్కరూ యేసు చూపిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో యేసురాజు, రాజారావు, రత్నాబాబు, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

ఘనంగా హోలీ వేడుకలు

హోలీ.. హోలీల రంగ హోలీ చమ్మకేలిలా హోలీ.. అంటూ ఊరువాడ ప్రజలు హోలీ సంబురాలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు గ్రామాల్లోని పురవీధుల్లో తిరుగుతూ కేరింతలు కొడుతూ రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. రాజస్థాని మార్వాడీలు సాంప్రదాయ బద్ధంగా హోలీ వేడుకలు నిర్వహించి, ఆడి, పాడి సామూహిక భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని ఆలయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలుచోట్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని సందడి చేసి.. అందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్‌



వైరా: మాటూరుపేటలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు



మధిర: సుందరయ్య నగర్‌లో..



కల్లూరులో..



ముదిగొండలో..



కల్లూరురూరల్‌: హనుమతండాలో నృత్యం చేస్తున్న గిరిజనులు



సత్తుపల్లిటౌన్‌: హోలీ వేడుకల్లో మార్వాడీలతో ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్‌



కొణిజర్ల: సందడి చేస్తున్న యువకులు



కొణిజర్ల: రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



తల్లాడ: ఎన్టీఆర్‌ నగర్‌లో..



చింతకాని: లచ్చగూడెంలో..



వైరారూరల్‌: విప్పలమడకలో..



తల్లాడ: కృష్ణ మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



కారేపల్లి: వెంకటసాయినగర్‌లో..



మధిర: హోలీ వేడుకల్లో పాల్గొన్న స్విమ్మర్లు



బోనకల్‌: రావినూతల గిరిజన కాలనీలో..



ముదిగొండ: కమలాపురంలో..



సత్తుపల్లిటౌన్‌: కోలాటం ఆడుతున్న మార్వాడీలు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పాతకారాయిగూడెం శ్రీరాధా కృష్ణుడి గుడి..



శ్రీరాధా కృష్ణుడి గుడిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్‌

పెనుబల్లి: మండలంలోని పాతకారాయిగూడెం శ్రీరాధా కృష్ణుడి గుడి వార్షికోత్సవం వేడుకల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్‌ మట్టా రాగమయి దయానంద్‌ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం హోలీ పండుగ, శ్రీరాధా కృష్ణుడి గుడి వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే, దయానంద్‌ దంపతులు కలిసి పూజలు నిర్వహించి, గ్రామస్తులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, స్వయంగా భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్‌, మండల నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, గూడూరు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి ఆలయంలో..

వేంసూరు: మండల పరిధిలోని భీరపల్లి రామన్నపాలెం, కేజీ మల్లెల, జయలక్ష్మీపురం, చిన్నమల్లెల, పెనుబల్లి మండలం గణేష్‌పాడు శివారు కొలువుదీరియున్న సత్తెమ్మ తల్లి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి విగ్రహాన్ని తీరొక్క పూలతో సుందరంగా అలంకరించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భీరపల్లి, గణేష్‌పాడు గ్రామాలకు చెందిన కొలాట బృందల కొలటం భక్తులను ఆకట్టుకుంది. ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్‌ రాష్ట్ర నాయకుడు మట్టా దయనంద్‌ విజయ్‌ కుమార్‌ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌కు 63 మంది విద్యార్థులు



మాట్లాడుతున్న మధుసూదన్‌రాజు

సత్తుపల్లిరూరల్‌: స్థానిక విశ్వశాంతి విద్యాలయానికి చెందిన విద్యార్థులు తెలుగుబుక్‌ ఆఫ్‌ వరల్డ్‌ రికార్డ్స్‌ (టీబీఆర్‌)లో స్థానం కోసం గత కొద్ది రోజులుగా కృషి చేస్తున్నారు. ప్రతి విద్యార్థి ఒక అంశం చొప్పున మొత్తం 63 మంది విద్యార్థులు 63 రకాల శాస్త్రీయ వాస్తవాలు గురించి రెండు గంటల పాటు నిరంతర విశ్లేషణ చేయనున్నారు. 3 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు ఇందుకు సిద్ధమయ్యారు. కొద్దిరోజుల క్రితం విశ్వశాంతి విద్యాలయం 'తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌'సంస్థకు దరఖాస్తు చేయగా ఇటీవల అనుమతి లభించింది. ప్రతిభగల విద్యార్థులచే వివిధ సంస్థల రికార్డుల్లో పేరు నమోదు చేయించడంలో అనుభవం కలిగిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి.మధుసూదన్‌ రాజు, తెలుగుబుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ సీఈఓ డాక్టర్‌ బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి 'శాస్త్రీయ వాస్తవాలు – వివరణ'కార్యక్రమానికి సిద్ధమవుతున్న విద్యార్థులతో సమావేశమయ్యారు. వారి ప్రతిభను పరిశీలించారు. రికార్డ్స్‌ నమోదు సందర్భంగా టీబీఆర్‌ సంస్థ నిర్వహించనున్న చివరి పరీక్షలో నెగ్గేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం యాజమాన్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

వైరారూరల్‌: మండలంలోని తాటిపూడి గ్రామంలోని కొంత మంది రైతులు విరాళాలు వసూలు చేసి.. పొలాలకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేసుకున్నారు. వైరా నుంచి మధిర వెళ్లే అర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న పొలాలకు వెళ్లే కంకర రోడ్డుకు రైతులు మరమ్మతులు చేశారు. ఉమ్మడి అంధ్రప్రదేశ్‌ హయంలో పొలాలకు వెళ్లేందుకు ఈ కంకర రోడ్డును నిర్మించారు. అయితే రోడ్డు మొత్తం కంకర తేలి గుంతలు ఏర్పడిన నేపథ్యాన పొలాలకు వెళ్లేందుకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. దాంతో ఈ రోడ్డులోని రైతులు ఎకరాకు రూ.2 వేల చొప్పున విరాళాలు వేసుకున్నారు. 55 ఎకరాలకు గానూ రూ. 1.10 లక్షల నిధులు సమకూర్చుకొని కంకర తేలి అధ్వానంగా ఉన్న రోడ్డుకు గ్రావెల్‌ తోలి సుమారు కిలోమీటర్‌ వరకు మరమ్మతులు చేసుకున్నారు.

రైతులు మరమ్మతులు చేసుకున్న రోడ్డు →



పాపన్న గౌడ్‌ విగ్రహావిష్కరణ పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

పెనుబల్లి: బహుజన చక్రవర్తి సర్దార్‌ సర్వాయ్‌ పాపన్నగౌడ్‌ విగ్రహ ఆవిష్కరణ ఆహ్వాన పోస్టర్లను సోమవారం పెనుబల్లి మండల గౌడ సంఘ, బహుజన నాయకులు ఆవిష్కరించారు. మార్చి 31న వియంబంజర్‌లోని పాపన్న గౌడ్‌ విగ్రహ ఆవిష్కరణకు ప్రముఖ నటుడు తల్వారి సుమన్‌ గౌడ్‌, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌లు హాజరై విగ్రహఆవిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పెనుబల్లి మండల, పరిసర ప్రాంత గౌడ సంఘస్తులు, బహుజనులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికలను పలువురు గౌడ సంఘ నాయకులకు అందించారు. కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు వంగా గిరిజాపతి రావు, వేముల నరసింహారావు, వంగా దామోదర్‌ , బజ్జూరి నాగేశ్వరరావు, బొర్రా కోటేశ్వర రావు, గోదా శ్రీనివాసరావు, కుక్కా శ్రీనివాస రావు, వేముల బాబురావు, పర్సా రామకృష్ణ, మల్లెల శ్రీనివాసరావు, బందం వెంకటేశ్వర రావు, బానోత్‌ జగన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ముదిగొండ: మండలపరిధిలోని గంధసిరి, పెద్దమండవ మున్నేరుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై గజ్జెల నరేష్‌ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం రావడంతో సువర్ణాపురం క్రాస్‌ రోడ్డు వద్ద పెద్దమండవ, గంధసిరి ల నుంచి ఖమ్మం, ముదిగొండకు వెళ్లుతున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించి, డ్రైవర్లు, యజమానులపై తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి శ్రీరామాయణ సప్తాహం

సత్తుపల్లిటౌన్‌: పట్టణంలోని కాకర్లపల్లి రోడ్‌లో మంగళవారం నుంచి ఏడురోజుల పాటు ప్రముఖ అధ్యాత్మికవేత్త నల్లాన్‌ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామిచే శ్రీరామాయణ సప్తాహం నిర్వహించబడుతుందని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామాయణ ప్రవచనం, సామూహిక శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం , వేద ఇతిహాస పురాణదివ్య ప్రభంద పారాయణాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు అందరు పాల్గొనాలని బాల లీలాకృష్ణ, తేజా, మందపాటి కేశవరెడ్డి కోరారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం



చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

చింతకాని: మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయ ఆవరణలో సోమవారం రాత్రి శ్రీ భూ, నీలా సమేత శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణాన్ని వేదపండితులు ప్రతాపురం పవన్‌ కుమారాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, చతుస్థాన అర్చనలు, స్వస్తి పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, నిత్య హోమం, బలిహరణం, పూర్ణాహుతి, స్వామి ఎదురుకోళ్ల ఉత్సవం అనంతరం స్వామి కల్యాణాన్ని నిర్వహించి.. తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామికల్యాణ మహోత్సవంలో తహసీల్దార్‌ రమేష్‌ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్దఎత్తున విరాళాలు అందించారు. అలాగే సీతంపేట గ్రామంలో శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహస్వామి, కోమట్లగూడెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ లక్ష్మీ అంకమ్మ తల్లి కల్యాణ మహోత్సవాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు, ఆలయ అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు, జూనియర్‌ అసిస్టెంట్‌ సిద్దెల నాగరాజు, గ్రామపెద్దలు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పుట్టినరోజు వేడుకలు



సత్తుపల్లి: అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

సత్తుపల్లి/కల్లూరు: సత్తుపల్లిలోని శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయం, రాజీవ్‌నగర్‌ అయ్యప్పస్వామి దేవాలయాలలో అయ్యప్పస్వామి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, అభిషేకాలు, స్వామివారికి అష్టాభిషేక పూజలు నిర్వహించారు. వెన్నతో అలంకరణ చేసి తీర్థప్రసాదాలు అందించారు. అదే విధంగా కల్లూరులోని కనకగిరి శివాలయంలో ఆదివారం గురుస్వామి నాయర్‌ ఆశీస్సులతో అయ్యప్పస్వామి భక్త బృంధం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం నాలుగువేల మందికి మహాన్నదాన కార్యక్రమం నిర్వహించగా.. ఎస్సై ఎస్‌కే షాకీర్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, దోసపాటి అమరలింగేశ్వరరావు, రేపాకుల శ్రీనివాసరావు, భక్త బృంధం సభ్యుడు మల్లాది బసవయ్య, గండు సత్యం, బలగాని శ్రీను, జె తిరుమలరావు, వెంకటేశ్వరరావు, కాటేపల్లి రజనీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బావి

కొణిజర్ల: మండలంలోని లింగగూడెం గ్రామ సమీపంలో ఓ వ్యవసాయ బావి రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉంది. కొణిజర్ల నుంచి పెద్దగోపతి మీదుగా చింతకాని మండల కేంద్రం వరకు డబుల్‌ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీనిలో భాగంగా రోడ్డు వెడల్పు చేయడంతో వ్యవసాయ బావి రోడ్డు పక్కకే వచ్చింది. బావి చుట్టూ పిచ్చి చెట్లు ఉండటంతో దగ్గరికి వచ్చేవరకు అక్కడ బావి ఉన్నట్లు ఎవరికీ అర్థం కావడం లేదు. దీంతో రాత్రి వేళలో వాహనదారులు అదుపు తప్పి బావిలో పడే ప్రమాదం ఉందని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



లింగగూడెం సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న బావి